క్లుప్తంగా

రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి


ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని కట్టమంచి ప్రాంతంలో హైరోడ్డు విస్తరణ పనులను జోరుగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం కట్టమంచిలో రోడ్డు ఆక్రమణ తొలగింపునకు నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. సీపీ నాగేంద్ర ఆదేశాల మేరకు ప్రణాళిక విభాగం అధికారులు భవన ప్లాన్ అప్రూవల్ ప్రకారం అక్రమ కట్టడాలను జేసీబీలతో తొలగించారు. రోడ్డు విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నాగేంద్ర పేర్కొన్నారు.

పేదల ఇంటి వద్దకే వైద్య సేవలు


రోగులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు

తవణంపల్లె: పేదలకు ఇంటింటికీ వైద్య సేవలందిస్తున్నట్లు డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని ముట్టుకూరులో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు 108, 104, తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర


గ్రామోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఐరాల: మండలంలోని సీవీ.పల్లె దళితవాడలో బుధవారం గ్రామస్తుల గంగ జాతర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పసుపు, కుంకుమ, సుగంధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారికి అంబలి, సాయంత్రం పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించి, మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, బాణసంచా వేడుకల నడుమ అమ్మవారిని సమీపంలోని చెరువులో నిమజ్జనం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

డీసీవో దృష్టికి గురుకులాల సమస్యలు

చిత్తూరు కలెక్టరేట్: ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకులాల కో–ఆర్డినేటర్ దృష్టికి సమస్యలు తీసుకెళ్లినట్లు జనసేన నాయకులు మహేష్ తెలిపారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు బుధవారం జిల్లా కో ఆర్డినేటర్ పద్మజను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. జిల్లాలోని గురుకుల పాఠశాల సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం ఆ పార్టీ నాయకులు కలెక్టర్‌ను కలిసి యాదమరి మండలం సిద్ధారెడ్డిపల్లిలో ఉన్న ప్రాథమిక పాఠశాలను విలీనం చేయకూడదని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు యువరాజు, అజిత్, శ్రీరాములు పాల్గొన్నారు.

అందని మామూళ్లు.. కదలని ఫైళ్లు



- కార్పొరేషన్‌లో భారీ ఎత్తున ఫైళ్ల పెండింగ్
- రెవెన్యూ విభాగంలో మామూళ్ల రాజ్యం
- ఆర్డీ చెప్పినా లెక్కలేదంతే!

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగం పూర్తిగా గాడి తప్పింది. ఇద్దరు రెవెన్యూ అధికారులు, నలుగురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయానికి ఓ అడ్మిన్ చొప్పున 51 మంది కార్యదర్శులు. ఇంత పెద్ద వ్యవస్థ ఉన్న రెవెన్యూ విభాగం మునిసిపల్ ఖజానా బలోపేతం చేయడంలో కీలకంగా పనిచేయాలి. కానీ ఇక్కడ పనిచేస్తున్న కొందరు అధికారులు వారి సొంత ఆదాయం పెంచుకోవడంపై చూపించే శ్రద్ధ, కార్పొరేషన్ ఆర్థిక పరిపుష్టిపై పెట్టడంలేదు.

సొంత లాభం ఉంటేనే...?

మునిసిపల్ ఖజానాకు ప్రధాన వెన్నెముక రెవెన్యూ విభాగం. ఆస్తి పన్ను వసూళ్ల నుంచి వేకెంట్ ల్యాండ్ టాక్స్ (వీఎల్‌టీ) వరకు ప్రతి ఒక్క ఆస్తికి పన్ను మదింపు చేయడం, కొత్తగా పన్నులు వేయడం, బకాయి ఉన్న పన్నులు రాబట్టడం, ఆస్తి పన్ను పేరుమార్పు, సాల్వెన్సీ ధృవీకరణ పత్రం మంజూరు, నిర్మాణంలో ఉన్న భవనాలకు పన్నులు వేయడం లాంటి పనులన్నీ రెవెన్యూ విభాగం పరిధిలోకే వస్తాయి. గతంలో రెవెన్యూ విభాగంలో ఒక్కరే రెవెన్యూ అధికారి (ఆర్‌వో) ఉండడంతో, అదనపు ఆదాయం ఒక్కరికే వచ్చేది. దీంతో కొందరి ఆర్థిక పరిస్థితి మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక చిత్తూరు కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగానికి ఇద్దరు ఆర్‌వోలను నియమించారు. దీంతో అధికారుల మధ్య వర్గపోరు మొదలైంది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లలో తమను నచ్చిన వాళ్లను వర్గాలుగా విభజించి, చేతుల్లో పెట్టుకున్నారనే విమర్శలున్నాయి. దీంతో పనులపై కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చే ప్రజలు, అదనపు దక్షిణ ఇస్తే తప్ప ఫైళ్లు కదలడం లేదనే ఆరోపణలు గుప్పు మంటున్నాయి.

వందల్లో ఫైళ్లు పెండింగ్

ప్రస్తుతం కార్పొరేషన్ కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు ఆర్‌వోలు, ఆర్‌ఐ వద్ద వందల కొద్దీ ఫైళ్లు స్తంభించిపోయాయి. ప్రజలు పన్ను మదింపు, కొత్త పన్నులు, ఆస్తిపన్ను పేరు బదలాయింపు కోసం దరఖాస్తు చేసుకుంటే 15 రోజుల్లో వాటిని పరిష్కరించాలి. కానీ 15రోజులు గడిచిపోయినా కూడా ఓ ఆర్‌వో తన వద్ద 70 ఫైళ్లను పెండింగ్ పెట్టుకుంటే, మరో వ్యక్తి 22 ఫైళ్లు తొక్కి పెట్టేశారు. ఇక ఆర్‌ఐలకు ఉన్నతాధికారులంటే ఏమాత్రం లెక్కలేదు. తామేమీ తక్కువ కాదంటూ ఓ ఆర్‌ఐ 62 ఫైళ్లను, మరో ఆర్‌ఐ 48 ఫైళ్లను, ఇలా ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు పనులు సకాలంలో పూర్తి చేయకుండా ఇష్టానుసారం ఫైళ్లను పెండింగ్‌లో ఉంచేసుకుంటున్నారు.

ఆర్డీ చీవాట్లు..

ఇటీవల అనంతపురం మునిసిపల్ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) విశ్వనాథ్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. చిత్తూరు కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగం అధికారుల లాగిన్‌లో వందల కొద్దీ ఫైళ్లు పెండింగ్‌లో ఉండడంపై ప్రశ్నిస్తే, అధికారులు నీళ్లు నమిలారు. దీంతో ముగ్గురు అధికారులకు నోటీసులు జారీచేసి, వాళ్ల నుంచి సంజాయిషీ తీసుకోవాలని చీవాట్లు పెట్టారు. మరి ఇప్పటికైనా రెవెన్యూ విభాగం గాడినపడుతుందో, లేదో వేచి చూడాలి.

అధినేతతో విజయానందరెడ్డి


జగన్‌ను కలిసిన విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి కలిశారు. తాడేపల్లె పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో రాష్ట్రంలోని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు, రీజనల్ కో–ఆరినేటర్లు పాల్గొన్నారు. సమావేశం అనంతరం జగన్‌ను విజయానందరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం చిత్తూరు నియోజకవర్గంలో జరుగుతున్న పలు అంశాల పై మాట్లాడారు.

30న మండల సమావేశం

గుడిపాల: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శిరీషా బుధవారం తెలిపారు. 30న ఉదయం11 గంటలకు అన్ని శాఖల అధికారులు వారికి సంబంధించిన ప్రగతి నివేదికతో సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి భారతి


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి భారతి

పూతలపట్టు(యాదమరి): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి భారతి అన్నారు. పూతలపట్టు మండలంలోని శ్రీ ఆర్కేఎం లా కాలేజీలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకుంటే సమాజంలో వారి పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కోవచ్చని చెప్పారు. ఉచిత న్యాయ సేవలు ఎలా పొందాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రావూరి వెంకటస్వామి, ప్రిన్సిపల్ ఎస్ఆర్ కటారి, చిత్తూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శంకర్ నాయుడు, 'లా' కళాశాల డీన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతోనే అధిక దిగుబడులు


మాట్లాడుతున్న ఏపీసీఎన్ఎఫ్ భారతి

ఐరాల: వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలంటే సేంద్రియ ఎరువులే శ్రేయస్కరమని మండల ఏపీసీఎన్ఎఫ్ భారతి సూచించారు. మండలంలోని మద్దిపట్లపల్లె రైతు సేవా కేంద్రంలో బుధవారం స్థానిక రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయంలో ఎరువుల ఎంపిక అత్యంత ప్రాధాన్యం కలిగి ఉందన్నారు. సాగుకు ముందుగా మట్టి పరీక్షలు చేయించుకుని దానికి అనుగుణంగా మంచి ఎరువులను ఎంచుకోవాలన్నారు. భూసారానికి హాని కలిగించే రసాయన ఎరువుల మోతాదును తగ్గించి పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు వంటి సేంద్రియ ఎరువులను అధికంగా వినియోగించాలన్నారు. రాయితీతో పంపిణీ చేస్తున్న పచ్చిరొట్ట ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు సస్యరక్షణకు డ్రోన్లను ఉపయోగించటం ద్వారా తక్కువ సమయం, ఖర్చుతో సమర్థవంతంగా పురుగు మందులను పిచికారీ చేయవచ్చని తెలిపారు. ఆధునిక సాంకేతికతను వినియోగించటంలో రైతులు ముందంజలో ఉండాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మద్దిపట్లపల్లె పశు వైద్యాధికారి పినాకపాణి పాల్గొన్నారు.

టోకెన్ పద్ధతిలో కొంటాం


పోలీసుల సమక్షంలో టోకెన్ల పంపిణీ

గుడిపాల: టోకెన్ పద్ధతిలో మామిడి కాయలను రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సికె పల్లె వద్ద ఉన్న తాసా జ్యూస్ ఫ్యాక్టరీలో బుధవారం మామిడి లోడ్లతో వచ్చిన ట్రాక్టర్ల వద్దకు వెళ్లి టోకెన్లను వారు పోలీసుల సహాయంతో స్వయంగా అందజేశారు. ప్రతి ఒక్క రైతు వద్ద మామిడి పంటను కొనుగోలు చేసి ఫ్యాక్టరీలకు అందజేస్తామని ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్, తాసా జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద సుమారు 600 ట్రాక్టర్ల వరకు ఉన్నాయి.

జవహర్ నవోదయకు విద్యార్థి ఎంపిక


పునీత్‌సాయిని అభినందిస్తున్న ఎంఈఓలు

పూతలపట్టు(యాదమరి): పీఎంశ్రీ జవహర్ నవోదయకు పూతలపట్టు మండలం నుంచి విద్యార్థి ఎంపికైనట్లు ఎంఈఓలు వాసుదేవన్, మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వారు బుధవారం మాట్లాడుతూ మండల పరిధిలోని ఈడిగపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థి ఎస్.పునిత్‌సాయి మదనపల్లిలోని జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు తెలిపారు.

పట్ట విప్పి చూడ.. పురుగులుండు !




చిత్తూరు నగరం అనుపల్లి ప్రాంతంలోని రైతు వారం క్రితం మామిడి కాయలు(తోతాపురి) కోశారు. టోకెన్ ప్రకారం గంగాసాగరంలోని ఫ్యాక్టరీ ఎదుట కాయలతో ఉన్న ట్రాక్టరు ట్రాలీ వదిలి ఇంజిన్ వరకు తీసుకెళ్లిపోయాడు. పనిలో పడి ఫ్యాక్టరీ ఎదుట కాయలున్న ట్రాలీ విషయాన్ని మర్చిపోయాడు. తరువాత గుర్తుకు రావడంతో మంగళవా రం రాత్రి హుటాహుటిన ఫ్యాక్టరీ వద్దకు పరుగులు తీశాడు. సెక్యూరిటీ వద్ద వరుస నెంబరు చూసుకున్నాడు. ఆ వరుస నెంబరు దాటి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు అన్‌లోడింగ్ అయ్యాయి. ఫ్యాక్టరీ సిబ్బంది అయ్యో పాపమంటూ..ఆ ట్రాక్టర్ అన్‌లోడింగ్‌కు పెట్టారు. పైన కట్టిన టార్పాలిన్ పట్ట విప్పి చూస్తే మామిడి పండ్లన్నీ కుళ్లిపోయి, పురుగులు కదులుతూ కనిపించాయి. సగానికి పైగా కాయలు పడేయాల్సి వచ్చింది.

–చిత్తూరు రూరల్(కాణిపాకం)

ఇందిరమ్మ కాలనీలో గంగజాతర


నడివీధిలో కొలువుదీరిన గంగమ్మ

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఇందిరమ్మకాలనీలో బుధవారం రాత్రి గంగమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. జాతరలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి శిరసును విశేషంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. బుధవారం తెల్లవారుజామున గ్రామ నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో గంగమ్మను కొలువు దీర్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారిని బాణసంచా వేడుకల నడుమ జలప్రవేశానికి తరలించారు. ఈ కార్యక్రమంలోగ్రామస్తులు పాల్గొన్నారు.

అలరించిన అర్జున తపస్మాన్



పద్యాలను ఆలపిస్తున్న అర్జున వేషధారి, తపస్మాన్‌ను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

పూతలపట్టు(యాదమరి): మండల పరిధిలోని పోటుకనుమలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలు విశేషంగా జరుగుతున్నాయి. అర్జున తపస్మాన్ కార్యక్రమం బుధవారం భక్తులను అలరించింది. ఇంద్ర సుతుడు అర్జునుడు శివుడిని మెప్పించి పాశుపతాస్త్రం పొందే క్రమంలో అర్జున వేషధారి పాడిన పద్యాలు, పాటలు భక్తులను ఎంతగానో మెప్పించాయి. అర్జునుడిగా తారక్, శివునిగా త్యాగ, పార్వతిగా ధనలక్ష్మి నటన ప్రేక్షకులను రంజింపజేసింది. సంతానం లేని మహిళలు తపస్మాన్ వద్ద ఒర పద్దారు. దీనికి భానుమూర్తి నాయుడు కుటుంబం ఉభయదారుగా వ్యవహరించింది. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం రాత్రి శ్రీ వేంకటేశ్వర నాటక కళామండలి కిరణ్ బృందం వారిచే గయోపాఖ్యానం నాటకాన్ని భక్తులను ఆకట్టుకునేలా ప్రదర్శించారు.

బడి మానేసిన వారికి వరం.. సార్వత్రిక విద్య

- ఇంటి దగ్గరే పది, ఇంటర్ చదివే అవకాశం
- ప్రారంభమైన అడ్మిషన్ల ప్రక్రియ
- తుది గడువు జూలై 31



బంగారుపాళెం: రోజువారీ కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా సార్వత్రిక పాఠశాల ద్వారా పది, ఇంటర్ చదివే అవకాశాన్ని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం కల్పిస్తోంది. రెగ్యులర్ 10వ తరగతి, ఇంటర్‌లో కొన్ని సబ్జెక్టులు పూర్తి చేయకపోయిన వారు ఉత్తీర్ణత పొందిన వాటిలోంచి గరిష్టంగా రెండు సబ్జెక్టులతో మాత్రమే పరీక్షలు రాసే విధంగా రూపొందించిన ఈ కోర్సులకు ప్రవేశ ప్రకటన వెలువడింది. జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో నిర్వహించే సార్వత్రిక విద్యాప్రవేశాలకు దరఖాస్తులు ఈ నెల 12 నుంచి ఆహ్వానిస్తున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 95 కేంద్రాలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మొత్తం 95 ఏఐ కేంద్రాలు ఉన్నాయి. ప్రవేశాలు పొందగోరే వారు అధ్యయన కేంద్రం వద్ద దరఖాస్తు ఏఐ కో–ఆర్డినేటర్ వద్ద ఆన్‌లైన్ చేయించుకుని, ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం 1991 నుంచి ఏపీ ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రవేశ పెట్టింది.

ప్రవేశాలు ఇలా ..

ఆన్‌లైన్‌లో ఈ నెల 12వ తేదీ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. అపరాధ రుసుం లేకుండా జూలై 31వ తేదీ లోగా ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు. రూ 200 అపరాధ రుసుంతో ఆగస్టు 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అడ్మిషన్ పొందవచ్చు. 10వ తరగతిలో జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,550. అన్ని వర్గాల స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజుతో కలిపి రూ.1,150 చెల్లించాలి. ఇంటర్‌లో జనరల్ పురుషులకు రూ.1,800, అన్నివర్గాల మహిళలకు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మైనార్టీ వారికి రూ.1,500 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్ఎస్‌సీ, ఇంటర్‌కు రూ.200 చొప్పున ఫీజుకు అదనంగా అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫీజులకు అదనంగా మీసేవా చార్జీలు రూ.36 చెల్లించాలి.

కనీసం 24 కాంటాక్టు తరగతులు

అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం, నెలలో రెండో శనివారం అధ్యయన కేంద్రాల్లో 30 కాంటాక్టు తరగతులు నిర్వహిస్తారు. కనీసం 24 తరగతులకు హాజరైన వారికి మాత్రమే పరీక్షకు అనుమతిస్తారు. 10వ తరగతిలో ప్రవేశం పొందాలనుకునే వారు గ్రూపు–ఎలో ఇంగ్లీషుతో పాటుగా తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు–బిలోని గణితం, సైన్స్ సోషియల్ తీసుకోవాలి. ఇంటర్‌లో గ్రూపు–ఎలో ఇంగ్లీషుతో పాటు తెలుగు/ హిందీ/ తమిళం/ ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు–బి ప్రధాన సబ్జెక్టుల నుంచి మూడు సబ్జెక్టులతో కలిపి ఐదు సబ్జెక్టులతో పూర్తి చేసుకునే అవకాశం ఉంది. సార్వత్రిక పాఠశాలలో చేరే వారికి స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు.

ఐదేళ్లలో పూర్తి చేయాలి

అభ్యాసకులు నిర్ణీత ఐదేళ్లలో తొమ్మిది సార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులవ్వాలి. అలా పాసుకాకపోతే తిరిగి అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది. 10వ తరగతి ఉత్తీర్ణత రెండేళ్ల వ్యవధి ఉంటే ఇంటర్‌లో ఐదు సబ్జెక్టులు ఒకేసారి రాసుకోవచ్చు.

అర్హతలు ఇవే..

- ఎస్ఎస్‌సీ కోర్సులో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 14 ఏళ్ల వయసు నిండి ఉండాలి
- గరిష్ఠ వయోపరిమితి ఉండదు
- దరఖాస్తుతోపాటు టీసీ, రికార్డుల షీటు, పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఇంటర్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి
- ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం , దివ్యాంగులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది.

మార్కుల బదలాయింపు

రెగ్యులర్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఫెయిలైనప్పటి నుంచి ఐదేళ్లలోపు సార్వత్రిక పాఠశాలలో చేరితే రెగ్యులర్ ఎస్ఎస్‌సి, ఇంటర్ పాసైన సబ్జెక్టుల నుంచి ఏవైనా రెండు సబ్జెక్టుల మార్కులను బదలాయించుకునే వీలుంది. పదిలో హిందీ మార్కులను మాత్రం బదలాయించరు. ఇలా బదలాయించుకున్న వారు మిగిలిన మూడు సబ్జెక్టుల పరీక్షలు రాస్తే సరిపోతుంది. మార్కులు బదలాయించుకునే వారు ఎస్ఎస్‌సిలో సబ్జెక్టుకు రూ.100, ఇంటర్‌కు రూ.150 చొప్పున అదనంగా చెల్లించాలి.

నేడు మాదక ద్రవ్యాల నివారణపై ర్యాలీ

చిత్తూరు కలెక్టరేట్: మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా, మండల, నియోజకవర్గ స్థాయిల్లో ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా స్థాయిలో గురువారం మధ్యాహ్నం 3.15 గంటలకు గాంధీ సర్కిల్ నుంచి ర్యాలీ నిర్వహిస్తారన్నారు. ఈ ర్యాలీలో ప్రజాప్రతినిధులు, పోలీసులు, అధికారులు పాల్గొనాలని కోరారు.